
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం ¦ 28 ¦ ఫిబ్రవరి ¦ 2023



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది. మార్కెట్‌కు 360 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 496 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
37.8°/10.6°
జిల్లాలో సోమవారం ఉదయం చలి తీవ్రత నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవగా, రాత్రి తగ్గుముఖం పట్టాయి. ఉదయం చలి, మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగింది.

న్యూస్‌రీల్

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లా మినరల్ ఫౌండేషన్(డీఎంఎఫ్‌లు) ద్వారా వచ్చే నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులు, మైనింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... మైనింగ్ కార్యకలాపాలతో ప్రభావితమైన ప్రాంతాల్లో ప్రజల సంక్షేమానికి, ప్రాథమిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. ఇందుకు సుమారు రూ.10 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 55 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 15, సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 361 పనులు పూర్తి చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి నిధులకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేసి డీఆర్‌డీఏ పీడీకి అందజేయాలన్నారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ అధికారులు బాలసుబ్రహ్మణ్యం, రాంబాబు, డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రషీద్, పీఆర్ అధికారి విజయ్‌శేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

హిందూపురం టౌన్: ఇంటర్ ప్రాక్టికల్స్‌లో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా పక్కాగా సాగాలని ఇంటర్ విద్య ఆర్‌జేడీ రవి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని ఎల్ఆర్‌జీ ఏ, బీ సెంటర్లు, సప్తగిరి కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రాక్టికల్స్ జరుగుతున్న ప్రతి కేంద్రంలోని ల్యాబ్‌లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా ప్రాక్టికల్స్ తీరును ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుంటామన్నారు. అలాగే ప్రతి ల్యాబ్‌లోనూ పరికరాలు ఉండాలన్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణలో ఇంటర్‌బోర్డు నిబంధనలన్నీ పాటించాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ఆర్‌జేడీ వెంట డీఐఈఓ రఘునాథ్‌రెడ్డి ఉన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీలు తలారి రంగయ్య, మాధవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు శంకరనారాయణ, పైలా నరసింహయ్య



పాల్గొన్న ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మహమ్మద్ ఇక్బాల్, మంగమ్మ, ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, వై.వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, పీవీ సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు

- పార్టీ శ్రేణులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాల నూతన అధ్యక్షులు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురం అలెగ్జాండర్ ఫంక్షన్ హాలులో సోమవారం ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై నిర్వహించిన సమావేశంలో మంత్రి దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, రెడ్డప్ప, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మహమ్మద్ ఇక్బాల్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్ధారెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్‌యాదవ్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, బీసీ రమేష్‌గౌడ్, వీఆర్ రామిరెడ్డి, ఆయా నియోజకవర్గాల పరిశీలకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింత సోమశేఖరరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, కేవీ రమణ పాల్గొన్నారు.

1 నుంచి 'ఒకేషనల్' ప్రాక్టికల్స్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రంగస్వామి

కొత్తచెరువు: పదో తరగతి ఒకేషనల్ విద్యార్థులకు 1 నుంచి 7వతేదీ లోపు ప్రాక్టికల్స్ నిర్వహించాలని డిప్యూటీ డీఈఓ రంగస్వామి సూచించారు. సోమవారం ఆయన కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 19 పాఠశాలల్లో 10వ తరగతి ఒకేషనల్ చదువుతున్న 1,517 మంది విద్యార్థులకు 1 నుంచి 7వ తేదీలోపు ఆయా పాఠశాలల్లోని హెచ్ఎంలే ప్రాక్టికల్స్ నిర్వహించాలని, అందులో వచ్చిన మార్కులను ఎస్ఎస్‌సీ బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వారందరికీ తర్వాత పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మంగమ్మ ఏకగ్రీవం



డిక్లరేషన్ అందుకుంటున్న ఎమ్మెల్సీ మంగమ్మ, చిత్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ప్రజాప్రతినిధులు

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా కింద వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్.మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగమ్మకు డిక్లరేషన్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకరనారాయణ, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలమూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, లీగల్ సెల్ అధ్యక్షుడు ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

మంగమ్మకు మంత్రి అభినందనలు
స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మంగమ్మకు రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. అందులో భాగంగానే మంగమ్మకు అవకాశం కల్పించారన్నారు.

కందికుంటతో ప్రశాంతత కరువైంది



ఎస్పీకి విన్నవిస్తున్న కదిరి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు



విలేకరులతో మాట్లాడుతున్న కదిరి వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు

- కదిరి మున్సిపల్ కౌన్సిలర్ల ఆవేదన
- టీడీపీ నేత ఆగడాలపై ఎస్పీకి ఫిర్యాదు
- సీఐ గొంతు కోస్తానన్న కందికుంట వీడియోను ఎస్పీకి చూపించిన వైనం

పుట్టపర్తి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కొలువైన కదిరిలో టీడీపీ నాయకుడు కందికుంట వెంకటప్రసాద్, అతని అనుచరుల ఆగడాలతో ప్రశాంతత కరువైందని ఖాద్రీ ఆలయ చైర్మన్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కదిరి నుంచి పెద్ద ఎత్తున వాహనాల్లో విచ్చేసిన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఈ మేరకు ఎస్పీకి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు ఎస్పీతో మాట్లాడారు. త్వరలో జరగనున్న ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల క్రితం ఆలయ కార్యనిర్వహణాధికారి, కమిషనర్ ఆదేశాల మేరకు మాఢ వీధుల్లో ఆక్రమణల తొలగింపు పనులను మున్సిపల్ సిబ్బంది ప్రారంభించారన్నారు. ఈ సమయంలోనే కందికుంట, అతని అనుచరులు వచ్చి పనులను అడ్డుకోవడంతో పాటు అధికారులను, సిబ్బందిని దుర్భాషలాడారని తెలిపారు. పరుష పదజాలంతో దూషించి హెచ్చరికలు జారీ చేశారని, దీంతో వెంటనే మున్సిపల్ కమిషనర్, ఈఈ స్పందించి పోలీసుల సహకారంతో పనులు చేయించారన్నారు. అనంతరం కందికుంట వెంకటప్రసాద్ నేరుగా వచ్చి పనులను అడ్డుకున్నారన్నారు. ఆయన అధికారులను బెదిరించడం ఇది మొదటి సారి కాదని, ఇలాగే పలుమార్లు చేశారన్నారు.

సీఐ ఇంట్లోకి చొరబడ్డారు
కందికుంటతో పాటు అతని అనుచరులు కొంత మంది ఈనెల 25వ తేదీ సాయంత్రం సీఐ మధు ఇంట్లోకి అక్రమంగా చొరబడి సీఐని, వారి కుటుంబ సభ్యులను భయాందోళనలకు గురి చేశారని కౌన్సిలర్లు తెలిపారు. అడ్డుగా వచ్చిన స్థానికులను బెదిరించడంతో పాటు కులం పేరుతో దూషించారన్నారు. సీఐని ఇనుప రాడ్డుతో గాయపరిచి బెదిరించారని, సీఐ పైనే ఇలా దాడి చేస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

ఆదినుంచీ అతనిది నేరప్రవృత్తే..
కందికుంటది ఆది నుంచీ నేర ప్రవృత్తేనని కౌన్సిలర్లు ఎస్పీకి తెలిపారు. ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్లతో కుమ్మక్కై... డీడీలు తస్కరించి అరెస్టయిన వ్యక్తన్నారు. వివాదాస్పద స్థలాల్లో తలదూర్చి సామాన్యుల నుంచి రూ.లక్షలు గుంజడమే పనిగా పెట్టుకున్నారని, కందికుంట దొంగ పనులను సీఐ మధు అడ్డుకుంటున్నాడని, అందుకే ఆయన్ను చంపాలని ప్లాన్ వేశాడన్నారు. ఈ క్రమంలోనే సోమవారం ఆయన కొన్ని యూట్యూబ్ ఛానళ్లతో మాట్లాడుతూ.... సివిల్ డ్రెస్‌లో వస్తే సీఐ మధు గొంతు కోస్తామని చెప్పాడన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఎస్పీకి చూపించారు. దుర్మార్గుడైన కందికుంటపై వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో పాటు కదిరి ప్రజానీకాన్ని కాపాడాలని కోరారు. కదిరిలో బ్రహ్మరథోత్సవంతో పాటు త్వరలోనే సుమారు 4 లక్షల మంది ముస్లిం సోదరులు కలిసే ఇస్తమా సైతం ఉంటుందని, వాటిని శాంతియుతంగా జరుపుకోవడానికి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని కోరారు.

అల్లర్లకు పాల్పడితే సహించేది లేదు
ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ... కదిరి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అల్లర్లలో పాల్గొనకుండా శాంతియుతంగా ఉండాలని, అసాంఘిక శక్తులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పరికి సాదిక్, వైస్ చైర్మన్లు రాజశేఖరరెడ్డి, శంకర్, కౌన్సిలర్లు కృపాకర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, ఇలాహి, మహమ్మద్, ఫయాజ్, నౌషద్, బొబ్బిలి రవి, ఇస్మాయిల్, మురళీ, నూరుల్లా, ఖాశీం తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ బరిలో 61 మంది అభ్యర్థులు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 61 మంది నిలిచారు. నామినేషన్ల పరిశీలన అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీకి 51 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 14 మంది మిగిలారు. సోమవారం కలెక్టరేట్‌లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించారు. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీ నుంచి ఇద్దరు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నుంచి ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 49 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది పోటీ పడుతున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో...
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి (టీడీపీ), రాఘవేంద్ర నగురూరు (బీజేపీ), ఎస్.మల్లికార్జున (ఆల్ ఇండియా కిసాన్ జనతాపార్టీ)తో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా ఎ.జలాలుద్దీన్ మునీర్, టి.అశ్వర్థరెడ్డి, ఎ.అయ్యస్వామి, కె.నాగరాజు, కాంతి జాన్‌వెస్లీ, కాంతి భువన ఏకదాసరెడ్డి, కె.సూర్యశేఖరరెడ్డి, కె.లక్ష్మీనారాయణ, కె.హరి వెంకటరమణ, జి.వెంకటరమణ, జి.మల్లేశ్వరెడ్డి, జి.అలీహుసేన్, జి.మారుతీప్రసాద్, టి.రామన్న, ఎస్.రమేశ్‌నాయుడు, ఎస్.నరసింహ, పి.పవన్‌కుమార్, పి.చంద్రశేఖర్, పి.రవికుమార్, పి.నాగరాజు, పి.నరేంద్రబాబు, బి.మైసూరారెడ్డి, బి.రమేష్, బి.మారుతి గోవిందప్రసాద్, బోరంపల్లి ఆంజనేయులు, ఓంకారయ్య, భానుప్రకాష్‌రెడ్డి, డి.ఎం.మద్దిలేటి, మహమ్మద్ అక్బర్ హుసేన్, ఎం.అమానుల్లా, ఎం.గంగులప్ప, ఆర్.చంద్రప్ప, ఆర్.శివప్రసాద్, రాజన్న.ఎం.వి.రామచంద్రుడు, వెంకటేష్ వడ్డే, వెన్నపూస భరత్‌రెడ్డి, వెన్నపూస వెంకటరమణ కృష్ణారెడ్డి, షేక్ ఇమాం వలి, షేక్ గైబువలి, ఎస్.అమృత్‌కుమార్, ఎస్.జయకాంత్, ఎస్.కృష్ణమూర్తి, ఎస్.జనార్దనరాజు, హిమబిందు.టి పోటీలో నిలిచారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు..
ఎం.వి.రామచంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ మద్దతు), అనిల్‌కుమార్‌రెడ్డి.కె, ఒంటేరు శ్రీనివాసరెడ్డి, కత్తి నరసింహారెడ్డి (పీడీఎఫ్ మద్దతు), సి.వెంకటప్రసాద్‌రెడ్డి, సి.వరలక్ష్మి, జి.వి.నారాయణరెడ్డి, పి.గంగాధర్‌రెడ్డి, బి.మదన్‌మోహన్‌రెడ్డి, బి.శ్రీనివాసరావు, డి.రామశేషయ్య, ఎస్.మాధవరావు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీపడుతున్నారు.

బీటెక్, బీఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలోని నిర్వహించిన బీటెక్, బీఫార్మసీ (ఆర్–19) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ ఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ, ప్రీ–పీహెచ్‌డీ, ఎంఎస్, ఎంఫిల్ (ఆర్–9 నుంచి ఆర్–18) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి సోమవారం తెలిపారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలన్నారు.

క్లుప్తంగా

మద్యం అక్రమ రవాణాదారుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ధర్మవరంలోని బోయ వీధికి చెందిన వెంకటేష్ నాయక్, ముత్యాలు ఓ సంచిలో రూ.2,880 విలువైన 18 ఏపీ మద్యం బాటిళ్లను రవాణ చేస్తుండగా పట్టుబడ్డారు. స్థానికంగానే ఓ దుకాణంలో మద్యం కొనుగోలు చేసి రాత్రి సమయంలో ఇళ్ల వద్ద విక్రయించేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మద్యం కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేశారు.

మూఢనమ్మకాలపై చైతన్య బావుటా

- సైన్సు ప్రయోగాలకు పెరుగుతున్న ఆదరణ

సందర్భం: నేడు జాతీయ సైన్సు దినోత్సవం



అనంతపురం/కల్చరల్: మూఢ నమ్మకాలు.. అంధ విశ్వాసాలు ఎంతలా మనిషిని దిగజారుస్తున్నాయో రెండేళ్ల క్రితం బాలికా దినోత్సవం రోజు మదనపల్లిలో చోటు చేసుకున్న ఘటన అద్దం పడుతోంది. ఉన్నత విద్యావంతులు.. ప్రొఫెసర్లుగా జీవితంలో స్థిరపడిన దంపతులు మూఢ నమ్మకంతో తమ ఇద్దరు కుమార్తెలను దారుణంగా హతమార్చిన ఆ ఘటన యావత్ దేశంలోనే కలకలం సృష్టించింది. శాస్త్రీయ దృక్పథం లోపించడం వల్లనే ఇంతటి దారుణాలు చోటు చేసుకుంటున్నాయనేది అక్షర సత్యం. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైన్సును విస్తృత ప్రచారం చేసేందుకు పలు సంస్థలు నిరంతరం శ్రమిస్తున్నాయి. సైన్సు చేస్తున్న వింతలు, విశేషాలపై చైతన్యం కలిగేలా సర్ సీవీ రామన్ ఎఫెక్ట్ ఆవిష్కారమైన ఫిబ్రవరి 28న 'జాతీయ సైన్సు దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. భారతదేశ కీర్తిని ఇనుమడింపజేసిన శాస్త్రవేత్త రామన్ స్ఫూర్తిని అందిపుచ్చుకుని చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న కొందరి ప్రయాణంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా..

నాలుగు దశాబ్దాల పాటూ విద్య సంస్థల్లో సైన్సుపై ప్రచారం గావిస్తూ వందల కొద్ది ప్రదర్శనలతో మహాత్మ్యాలకు వ్యతిరేకంగా జనంలో చైతన్యం తీసుకువచ్చిన వారిలో తరిమెల అమరనాథరెడ్డి ప్రముఖుడు. గాలి నుంచి విబూది తీసివ్వడం.. నిప్పులపై నవ్వుతూ నడవడం.. వేడి నూనెలో చేయిపెట్టి హాయిగా బజ్జీలు తీసుకుని తినడం వంటివి చేసి చూపించి ఇవన్నీ గారడీ విద్య లేనని నిరూపించారు. భక్తి పేరుతో చేస్తున్న కొందరు స్వామీజీలు చేస్తున్న మోసాల్లో ఇవన్నీ చోటు చేసుకుంటాయని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలంటూ శాస్త్ర విజ్ఞానంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. సిలోన్‌కు చెందిన అబ్రహాం కోవూరు, ప్రఖ్యాత నాస్తికవాది ప్రేమానంద్ (కేరళ) స్ఫూర్తితో మానవతా సంస్థ ద్వారా నిరంతరం సైన్సుపై ప్రచారం చేస్తున్నారు.



విభూతి రాల్చే విధానంపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పిస్తున్న తరిమెల అమరనాథరెడ్డి (ఫైల్)

జాతీయ సైన్స్ దినోత్సవం ఆవిర్భావం ఇలా..

చంద్రశేఖర్ వెంకటరామన్ (సీవీ రామన్) 1888, నవంబరు 7న తమిళనాడులోని తిరుచినాపల్లి సమీపంలోని అయ్యన్ పెటాయ్ గ్రామంలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. మధ్య తరగతి కుటుంబం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. విశాఖపట్నంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసిన సి.వి.రామన్ చిన్నప్పటి నుంచి విజ్ఞాన శాస్త్ర విషయాలపై అమితమైన ఆసక్తి కనబరిచేవారు. తండ్రి భౌతిక శాస్త్ర అధ్యాపకులవడంతో ఆ దిశగా అతనిలో మరింత ఆసక్తి పెరిగింది. తన 12వ ఏట మెట్రిక్యులేషన్ (ఫిజిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించి) పూర్తి చేసిన రామన్.. 1907లో ఎంఎస్సీ (ఫిజిక్స్)లో యూనివర్సిటీకి ప్రథముడిగా నిలిచారు. తన 18వ ఏటనే కాంతికి సంబంధించిన ధర్మాలపై ఆయన సాగించిన పరిశోధనా వ్యాసం లండన్ నుంచి వెలువడే ఫిలసాఫికల్ మేగజైన్‌లో ప్రచురితమైంది. చివరి వరకు భారతదేశంలో సైన్స్ అభివృద్ధికి పాటుపడ్డ ఆ మహనీయుడు 1970 నవంబర్ 20న భౌతికంగా కన్నుమూశారు. అప్పటి నుంచి 1928లో ఫిబ్రవరి 28న ఈయన రామన్ ఎఫెక్టును కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని భారతదేశంలో ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తూ ఆయనను చిరంజీవిగా మనమధ్యే నిలిపేలా కొన్ని సంస్థలు ఆయన పేరు మీద టాలెంట్ టెస్ట్‌లు, సైన్స్‌కు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతూ వచ్చాయి.

నేడు వాడవాడలా సైన్సు దినోత్సవం

జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మంగళవారం పలు చోట్ల సైన్సు ప్రచార కార్యక్రమాలు సందడిగా జరగనున్నాయి. రెండేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం సైన్సు దేను సృజనోత్సవం పేరిట స్ఫూర్తిదాయకంగా సైన్సు సెంటర్ ద్వారా నిర్వహించారు. అదే కోవలో ఈసారి కూడా సైన్సు దినోత్సవ ప్రాధాన్యతను తెలియజేస్తూ యూనివర్సిటీలు, కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో సైన్సు ఫేర్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

ఒళ్లు గగుర్పొడిచే మ్యాజిక్కులు..



విద్యార్థి తలపై నిప్పు రాజేసి టీ కాస్తున్న శంకరశివరావు (ఫైల్)

జనవిజ్ఞాన వేదిక జాతీయ మ్యాజిక్ కమిటీ కన్వీనర్‌గా ఉన్న శంకరశివరావు సైన్సు ప్రచారాన్ని విస్తృతం చేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా ఓ వైపు విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు మూఢ నమ్మకాలను పారదోలేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈయన ప్రదర్శనలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటాయి. ఏ ఆధారం లేకుండా అమ్మాయిని గాలిలో నిలబెట్టడం, నాలుకపై శూలాన్ని గుచ్చుకోవడం, కళ్లకు గంతలు కట్టుకుని ట్రాఫిక్‌లో ద్విచక్రవాహనాన్ని వేగంగా నడపడం, నిమ్మకాయలు.. టెంకాయల నుంచి రక్తాన్ని తెప్పించడం, ఎగిసి పడుతున్న మంటల్లో నడవడం, నోటి నుంచి నిప్పు రాల్చడం.. తదితర అంశాలను ప్రదర్శించినప్పుడు ఆయనను మహిమాన్వితుడిగా గ్రామీణులు భావించేవారు. అయితే ఈ అద్భుతాల వెనుక దాగి ఉన్న సైన్స్ రహస్యాన్ని వివరించి ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నివేదిత

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణులకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ (ఆర్‌బీఎస్‌కే) జిల్లా అధికారి డాక్టర్ నివేదిత పిలుపునిచ్చారు. పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లిలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులు, మంచం పట్టిన రోగులను పరీక్షించి చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నివేదిత మాట్లాడుతూ.. గ్రామాల్లోకి వచ్చే 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. రాబోవు రోజుల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇకపై నెలంతా ప్రతి గ్రామంలోనూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగ దుర్గాదేవి, సీహెచ్‌ఓ నగేష్, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సత్యమ్మ, రాజశేఖర్, శ్రీదేవి, లక్ష్మీదేవి, లక్ష్మీపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి పదివేలకుపైగా ఇళ్లు పూర్తి కావాలి

- కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉగాది నాటికి జిల్లాలో 10,600 ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హౌసింగ్, నాడు-నేడు, ఆధార్ అప్‌డేట్, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతి, సచివాలయ సేవలపై సమీక్షించారు. తొలుత హౌసింగ్ అంశంపై మాట్లాడుతూ...ఇప్పటి వరకూ జిల్లాలో 2,336 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, పనులు వేగవంతం చేయాలన్నారు. మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి అర్బన్, హిందూపురం, హిందూపురం అర్బన్, బుక్కపట్నం మండలాల్లో పురోగతి తక్కువగా ఉందన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర భవన నిర్మాణ పనులు 60 నుంచి70 శాతం పూర్తయ్యాయన్నారు. మిగిలిన 30 శాతం పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండింగ్ కాని వాటిని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకూ మొదలుపెట్టని వాటిని రద్దు చేయాలన్నారు. ఆయా భవన నిర్మాణాలకు సిమెంటు తీసుకెళ్లినా పనులు చేయని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

సచివాలయాల్లో ఆధార్ సేవలందించాలి..

జిల్లాలో 33 సచివాలయల్లో ఆధార్ అప్‌డేట్ సేవలు అందుబాటులో లేవని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే పరిష్కరించి ఆధార్ సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. దీనిపై ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 80 వేల మంది 0 నుంచి 5 ఏళ్ల లోపు వయస్సు ఉన్న చిన్నారులు ఉండగా, 50 వేల మంది ఆధార్ అప్‌డేట్ చేయాల్సి ఉందన్నారు. చిన్న పిల్లల కోసం సోమ, మంగళవారాల్లో నిర్వహించే స్పెషల్ క్యాంపులను ఉపయోగించుకోవాలన్నారు. ఇక 6 నుంచి 9 ఏళ్లలోపు వయస్సున్న 14 వేల మంది చిన్నారులు, 2,300 మంది గర్భిణుల ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయాల్సి ఉందన్నారు. వీలైనంత త్వరగా అవన్నీ పూర్తి చేయాలన్నారు. అలాగే పంచాయతీరాజ్ పరిధిలో నాన్ ప్రియారిటీ పనుల కింద 836 సీసీ, బీటీ రోడ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ కేవలం 26 పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులంతా తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నరు. సచివాలయాల్లో మ్యారేజ్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంపై ఏసీబీ కన్ను

- ఆరునెలల కాలంలో ఆరుగురు పట్టుబడిన వైనం
- అవినీతి ఉద్యోగుల గుండెల్లో దడ

హిందూపురం: ఏసీబీ అధికారులు హిందూపురంపై ప్రత్యేక నిఘా ఉంచారు. అవినీతి అధికారులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. సమయం వచ్చినప్పుడల్లా ఉచ్చుబిగించి లంచావతారాలపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే గత ఆరునెలల కాలంలో ఏకంగా ఆరుగురు ఏసీబీ వలలో చిక్కుకున్నారు. సోమవారం కమర్షియల్ ట్యాక్ ఆఫీసులోనూ సీటీఓ, సీనియర్ అసిస్టెంట్, హెడ్‌క్లార్క్, అటెండర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. దీంతో ఏసీబీ పేరు వింటనే అవినీతి ఉద్యోగుల్లో దడ మొదలైంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని వణికిపోతున్నారు.

- 2022 సెప్టెంబర్ 18వతేదీ రాత్రి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ ఫ్రూట్‌జ్యూస్ నిర్వాహకుడి నుంచి రూ.20 వేలు లంచంగా తీసుకుంటూ ఏఎస్‌ఐ నాగరాజు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. డాక్యుమెంట్ రైటర్‌పై కేసు నమోదైతే దానికి సంబంధించిన నోటీసులు ఇవ్వడానికి లంచం డిమాండ్ చేయడంతో సదరు డ్యాకుమెంటర్ రైటర్ ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నారు.



కమర్షియల్ ట్యాక్స్ అధికారుల నుంచి ఏసీబీ స్వాధీనం చేసుకున్న నగదు

- 2022 సెప్టెంబర్ 24న మున్సిపల్ రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఆర్‌ఐ షఫీఉల్లా రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నిర్మించిన ఇంటి నిర్మాణానికి ప్రాపర్టీ టాక్సు నిర్ణయించడం కోసం లంచంగా డబ్బు అడగడంతో ఇంటి యాజమాని ఏసీబీ అధికారులకు ఆశ్రయించారు. వారి సూచన మేరకు రెవెన్యూ ఛాంబర్‌లో ఆర్‌ఐకి లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- ప్రస్తుతం కమర్షియల్ ట్యాక్ ఆఫీస్‌పై దాడి చేసి ఏకంగా నలుగురిని పట్టుకోవడం కలకలం రేగింది. దీన్ని బట్టి చూస్తే ఏసీబీ అధికారులు హిందూపురం పరిసరాల్లో దాదాపు అన్ని ఆఫీసులపై నిఘా ఉంచినట్లు కనిపిస్తోంది.

చిట్టీల పేరుతో మోసం చేశాడు!

- 'పోలీసు స్పందన'లో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

పుట్టపర్తి అర్బన్: చిట్టీల పేరుతో తమను నిలువునా మోసం చేశాడంటూ నల్లమాడకు చెందిన టీడీపీ సానుభూతి పరుడు వీరాంజనేయులుపై ఆ మండలానికి చెందిన పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో చేపట్టిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌ను కలసి అర్జీ అందజేసి, మాట్లాడారు. నల్లమాడ బస్టాండ్ కూడలిలో టీస్టాల్ నడుతున్న వీరాంజనేయులు కొంత కాలంగా నమ్మకంగా చిట్టీలు నిర్వహిస్తుండడంతో వందలాది మంది నమ్మి సభ్యులుగా చేరారు. ఇటీవల చిట్టీ డబ్బులు ఇవ్వకుండా వడ్డీతో కలిపి ఇస్తానని నమ్మబలకడంతో చాలా మంది అంగీకరించారు. రూ.కోటి వరకూ వసూలు చేసుకున్న తర్వాత గుట్టు చప్పుడు కాకుండా మూడు నెలల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లి పోయాడు. ఘటనపై నల్లమాడ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో స్పందన కార్యక్రమానికి వచ్చినట్లు వివరించారు. మోసపోయిన వారిలో అత్యధికంగా మాధవరెడ్డి రూ.18.5 లక్షలు, ఆంజనేయులు, భాస్కరరెడ్డి, వెంకటస్వామి, నల్లమాడ గౌషియా చెరో రూ.4లక్షలు, నల్లమాడ సుబ్రహ్మణ్యం గుప్త (రూ.6.5 లక్షలు) ఉన్నారు. అలాగే క్వారీ లీజుకు సబంధించి కర్ణాటకకు చెందిన దర్శన్, శ్రీనివాస్‌కు రూ.39 లక్షలు చెల్లించినా వడ్డీ చెల్లించాలంటూ దొంగ అగ్రిమెంట్లతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ ఎస్పీకి మడకశిర మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఖాసీంసాహెబ్, ఆయన భార్య షాహినా ఫిర్యాదు చేశారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

గుట్టకు నిప్పు.. పంటలు బుగ్గి



తనకల్లు: తగులబడుతున్న కర్బూజ పంట



కనగానపల్లి మంటల్లో కాలిపోయిన మామిడి మొక్కలు

తనకల్లు: మండలంలోని పోమేనాయక్ తండా వద్ద గుట్టకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో గుట్ట పక్కన రైతు సుధాకర్‌నాయక్ సాగు చేస్తున్న పంటలకు మంటలు వ్యాపించి రూ.3 లక్షలు నష్టం వాటిల్లింది. మొత్తం నాలుగు ఎకరాల్లో కర్బూజతో పాటు టమాట, వేరుశనగను రైతు సుధాకర్ నాయక్ సాగు చేశాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుట్టకు నిప్పు రాజేయడంతో సోమవారం తెల్లవారేసరికి గాలికి పంటలను మంటలు చుట్టుముట్టాయి. గమనించిన రైతులు మంటలు అదుపు చేసేలోపు టమాట, వేరుశనగతో పాటు కర్బూజ పంటలు కాలి పోయాయి.

అగ్నికి మామిడి మొక్కలు ఆహుతి..

కనగానపల్లి: మండలంలోని బాలేపాళ్యం గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో రైతు అనసూయమ్మ సాగు చేస్తున్న 150 మామిడి మొక్కలు కాలిపోయాయి. మూడేళ్ల క్రితం తనకున్న ఐదెకరాల మెట్ట పొలంలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద 350 మామిడి మొక్కలను ఆమె నాటి, పెంచి పోషిస్తున్నారు. ఆదివారం రాత్రి పొలానికి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు రాజేయడంతో మంటలు వ్యాపించి 150 మామిడి మొక్కలతో పాటు డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. దీంతో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత మహిళా రైతు వాపోయారు.

చెరకు తోట దగ్ధం

- రూ.25 లక్షల నష్టం

లేపాక్షి: ఏడాది పాటు కష్టపడి పెంచిన చెరుకు తోట కళ్ల ముందే అగ్నికి ఆహుతి కావడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. వివరాలు.. లేపాక్షి మండలం బిసలమానేపల్లికి చెందిన రైతు బి.ఆర్.వేణుగోపాలరెడ్డి.. ఓబుళాపురం గ్రామ సమీపంలో తనకున్న ఏడు ఎకరాలకు పైగా పొలంలో గత ఏడాది చెరుకు పంట సాగుచేపట్టాడు. పంట ఏపుగా పెరిగి దిగుబడి ఆశాజనకంగా ఉంది. 20 రోజుల క్రితం చెరుకు గానుగను ఏర్పాటు చేసి బెల్లం తయారీ చేపట్టాడు. సోమవారం ఉదయం బెల్లం తయారు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి చెరుకు తోటను చుట్టుముట్టాయి. బలమైన గాలులు వీస్తుండడంతో చూస్తుండగానే ఐదు ఎకరాల్లో పంటను మంటలు చుట్టుముట్టాయి. చుట్టుపక్కల రైతులు, కూలీలు, పశువులు కాపరులు స్పందించి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సమాచారం అందుకున అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకునేలోపు పంట మొత్తం తగులబడి పోయింది. దీంతో రూ.25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు.



కాలిపోయిన చెరుకు పంట

లోకల్ వ్యాపారాలను దెబ్బతీస్తున్నారు

బత్తలపల్లి: రెండు దశాబ్దాలుగా వివిధ వ్యాపారాలతో స్థానికులకు ఉపాధి కల్పిస్తున్న తమ వ్యాపారాలను ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి దెబ్బ తీస్తున్నాడని, దీనిపై ప్రశ్నిస్తే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాడని బత్తలపల్లిలోని వ్యాపారులు వాపోయారు. ఈ మేరకు ఎస్ఐ టీవీ శ్రీహర్షను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బత్తలపల్లి కూడలిలో వ్యాపారాలు చేసుకుంటున్న జక్కంపూడి ప్రవీణ్, మాల్యవంతం బాలిరెడ్డి, నిడిగల్లు శ్రీనివాసులు, సతీష్, ఇర్ఫాన్, కోటి సురేష్, వక్కల శ్రీనివాసులు, ఆవుల రమణారెడ్డి, వరిమడుగు రాజశేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా సిమెంట్, ఐరన్, ఎలక్ట్రికల్ తదితర సామగ్రి విక్రయిస్తూ తమతో పాటు మరో పది మంది కుటుంబాలకు ఉపాధి కల్పించినట్లు వివరించారు. గత ఏడాది ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి వచ్చి తాను టైల్స్ వ్యాపారం చేసుకుంటానంటే అందరమూ సహకరించామన్నారు. ఈ క్రమంలో స్థానిక వ్యాపారాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తుండడంతో వారం రోజుల క్రితం మూకుమ్మడిగా అందరూ వెళ్లి నిలదీశామన్నారు. టైల్స్ మాత్రమే అమ్ముకుంటామని చెప్పి ఇప్పుడు ఇతర సామగ్రిని పెట్టడం వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, టైల్స్ మాత్రమే అమ్ముకోవాలని కోరగా. హద్దు మీరి ప్రవర్తిస్తూ రెచ్చగొట్టేలా మాట్లాడాడన్నారు. దీంతో చెయ్యి చేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ అంశాన్ని కొందరు రాజకీయం చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు దాడి చేశారంటూ వక్రీకరిస్తున్నారని, అయితే ఇందులో అన్ని పార్టీలకు చెందిన వారు ఉన్నారనే విషయాన్ని గుర్తించాలని కోరారు. ఎప్పుడు తమ మధ్య రాజకీయాలు చోటు చేసుకోలేదన్నారు. స్థానికులకు ఉపాధి కల్పిస్తున్న తమకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని విన్నవించారు.



ఎస్ఐ టీవీ శ్రీహర్షకు వినత పత్రం అందజేస్తున్న లోకల్ వ్యాపారులు

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

అనంతపురం సిటీ: శాసన మండలి(ఎమ్మెల్సీ) ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి మార్చి 1న శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డి సోమవారం తెలిపారు. బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వేసే అంశంపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు గాను మండల, మున్సిపల్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవన్‌లో నిర్వహించే శిక్షణ తరగతులకు పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

